TELANGANA CAPITAL

# తెలంగాణ క్యాపిటల్

నిజం.. నిజాయితీ.. నిబద్ధత

TELANGANA CAPITAL NEWS

www.telanganacapitalnews.com

హైదరాబాద్ | సంపుటి : 1 సంచిక : 25 | శుక్రవారం, మే 3, 2024 | కంప్లిమెంటరీ కాపీ | పేజీలు : 4



## సీబీఐపై మా కంట్రోల్ లేదు..

### సుప్రీం కోర్టుకు తేల్చి చెప్పిన కేంద్రం

న్యూఢిల్లీ,మే,2: సీబీఐపై తమ కంట్రోల్ ఏమీ లేదని కేంద్ర ప్రభుత్వం సుప్రీం కోర్టుకు తేల్చిచెప్పింది. సీబీఐ దర్యాప్తు చేస్తున్న సమయంలో రాష్ట్ర ప్రభుత్వం అనుమతి తీసుకోలేదని పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. రాజ్యాంగంలో ఆర్టికల్ 131 ప్రకారం ఈ కేసు వేసింది. సీబీఐకి ఇచ్చిన సాధారణ సమ్మతిని రాష్ట్రం ఉపసంహరించుకున్నా దర్యాప్తు సంస్థ ఎఫ్ఐఆర్ నమోదు చేసి తమ రాష్ట్రంలో కేసుల ను దర్యాప్తు చేస్తోందని చెప్పింది. కేంద్ర ప్రభుత్వం తరపున సుప్రీంకోర్టుకు హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా, జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ సందీప్ మెహతా ధర్మాసనానికి రాజ్యాంగంలోని 131వ అధిక రణం రాజ్యాంగంలోని అత్యంత పవిత్రమైన అధికార పరిధి అని, అందు లోని నిబంధనలు ఉండవని చెప్పారు. కేసులను భారత ప్రభుత్వం దాఖ లు చేయలేదని, సీబీఐ నమోదు చేసిందని సొలిసిటరల్ జనరల్ తెలిపా రు. సీబీఐ స్వతంత్ర దర్యాప్తు సంస్థ అని.. కేంద్ర ప్రభుత్వ ప్రమేయం లేదని వివరించారు.

## లిక్కర్ స్కామ్ కేసులో ఎమ్మెల్సీ కవితకు నిరాశ



న్యూఢిల్లీ,మే,2: దేశవ్యాప్తంగా సంచలనం రేకెత్తించిన ఢిల్లీ లిక్కర్ పాలసీ కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితకు మరోసారి నిరాశ ఎదురైంది. సీబీఐ కేసులో కవిత బెయిల్ పిటిషన్‌పై తీర్పును మే 6కి వాయిదా వేస్తూ రౌస్ అవెన్యూ కోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఈడీ, సీబీఐ రెండు కేసుల్లోనూ కవిత బెయిల్ పిటిషన్లపై తీర్పును మే 6న వెలువరిస్తామని జడ్జి కావేరి బవేజా గురువారం ప్రకటించారు. కాగా ఇదివరకే కవిత బెయిల్ పిటిషన్‌పై తీర్పు వాయిదా పడింది. ఏప్రిల్ 22న తీర్పును కోర్టు రిజర్వ్ చేసింది. జైలా లేదా బెయిలా అనేది తేలుతుందని అంతా భావించారు. కానీ కవితను నిరాశకు గురిచేస్తూ తీర్పును మరోసారి కోర్టు వాయిదా వేసింది.

## హరీష్ రావు నుంచి సిద్దిపేటకు విముక్తి కల్పిస్తా..

- దేశంలో రిజర్వేషన్ల రద్దుకు కుట్ర సాగుతోంది
- జనాభా లెక్కించకపోవడం వెనుక బీజేపీ భారీ కుట్ర..
- అసిఫాబాద్ సభలో సీఎం రేవంత్ రెడ్డి



హైదరాబాద్,మే,2:
సిద్దిపేటను 45 ఏళ్లు నుంచి పాపాల బైరవుల్లా మామ, అల్లుడు పట్టిపీడిస్తున్నారని సీఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు. గురువారం సాయంత్రం నీలం మధుకు మద్దతుగా సీఎం రేవంత్ రెడ్డి రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మామ కేసీఆర్, అల్లుడు హరీష్ రావు నుంచి సిద్దిపేటకు విముక్తి కల్పించేందుకు వచ్చానని అన్నారు. ఈ సారి ఆరు నూరైనా మెదక్ గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగిరి తీరాలని పార్టీ నేతలకు సూచించారు. మెదక్ గడ్డపై కాంగ్రెస్ గెలవబోతోంది అంటే అది కార్యకర్తల గొప్పతనమే అన్నారు. ఇందిరా గాంధీ హయాంలో మెదక్‌కు అనేక పరిశ్రమలు కేటాయించారని గుర్తుచేశారు. నెహ్రూ, ఇందిరాగాంధీ వల్లే మెదక్‌కు అనేక పరిశ్రమలు వచ్చాయని అన్నారు. మెదక్ నుంచి ఇందిరా గాంధీ పోటీ చేశారని గుర్తుచేశారు. రాష్ట్రాన్ని పదేళ్లు దోచుకొని అక్రమంగా ఫామ్‌హౌజ్‌లు కట్టుకున్నోళ్లు కావాలా? ప్రజలకు మంచి చేసేవాళ్లు కావాలో నిర్ణయించుకోవాలని సూచించారు. ఈ సారి కాంగ్రెస్ గెలవకపోతే మెదక్ జిల్లాలో శాశ్వత బానిసత్వం వస్తుందని కీలక వ్యాఖ్యలు చేశారు.

ఇక్కడ పోటీ చేయకుండా పోలీసుల చేత కేసులు పెట్టించే పరిస్థితి వస్తుందని అన్నారు. వెంకట్రామిరెడ్డి నగదు చూసి టికెట్ ఇచ్చారని ఆరోపించారు. కలెక్టర్‌గా ఉండ వెంకట్రామి రెడ్డి వందల ఎకరాలు కొల్ల గొట్టారని అన్నారు.
నిజాం వద్ద ఖాసీం రిజ్వీ ఎలాగో.. కేసీఆర్ హయాంలో వెంకట్రామిరెడ్డి అలాగని కీలక వ్యాఖ్యలు చేశారు. కరీంనగర్‌కు చెందిన వెంకట్రామిరెడ్డిని మెదక్ అభ్యర్థిగా నిలబెట్టారని అన్నారు. మెదక్ బీఆర్ఎస్‌లో అభ్యర్థులే లేరా? అని ప్రశ్నించారు. సిద్దిపేటలో మీటింగ్ పెడితే ఎవరూ రారేమోనని మా నేతలు అన్నారు.. కానీ, ఈ జనాలను చూస్తే సిద్దిపేట గడీలు బద్దలు అవడం ఖాయంగా కనిపిస్తోందని సీఎం రేవంత్ అన్నారు.



## శ్రీలంక బాటలో నైజీరియా..

### పెట్రోలు బంకుల వద్ద కిలోమీటర్ల మేర క్యూలు..

న్యూఢిల్లీ,మే,2: ఆదేశం తీవ్ర అప్పులు పాలయ్యింది. విదేశీ మారక నిధుల నిల్వలు పడిపోయాయి. ఫలితంగా దిగుమతులు ఆగిపోయాయి. ప్రజలు పెద్ద ఎత్తున పెట్రోలు బంకుల వద్ద భారీగా క్యూ కట్టారు. ఆహారం, పెట్రోలు, గ్యాస్ కోసం కోసం అల్లాడిపోయారు. చివరికి అవి ఆందోళనలుగా మారాయి. ఇవన్నీ వింటుంటే టక్కున మనకు శ్రీలంకనే గుర్తొస్తుంది. కానీ.. ఇప్పుడు మనం చూడబోయేది మాత్రం శ్రీలంక కథ కాదు.. అది ముగిసిపోయింది. ఇప్పుడు శ్రీలంక బాటలోనే మరో దేశం అడుగులు వేస్తోంది. అక్కడ కూడా భారీగా పెట్రోలు కోసం ప్రజలు క్యూలు కడుతున్నారు. ఆ దేశం కూడా సంక్షోభంలో కూరుకుపోయింది. ఈ కథలో ట్విస్ట్ ఏమిటంటే... పెట్రోలు సంక్షోభం నెలకొన్న ఆ దేశంలోచమురు నిక్షేపాలు విస్తారంగా ఉన్నాయి. అలాంటి దేశంలో పెట్రోలు దొరకని పరిస్థితి నెలకొంది. పైగా బ్లాక్‌లో నాలుగు రెట్ల అధిక ధరలకు పెట్రోలను ఆ దేశ ప్రజలు కొనుగోలు చేస్తున్నారు. ఇంతకు ఏ ఆఫ్రికా దేశంలో సంక్షోభం నెలకొంది?చమురు నిక్షేపాలు భారీగా ఉన్నా.. ఎందుకు పెట్రోలు కొరత ఏర్పడింది?.. ఆ దేశ ప్రజలు సంక్షోభంపై ఏమంటున్నారు? ఈ దృశ్యాలు గుర్తున్నాయా? 2022లో శ్రీలంక వ్యాప్తంగా ఏపెట్రోలు బంకులో చూసినా.. భారీగా జనం క్యూలు కట్టేవారు.
పెట్రోలు, గ్యాస్ కోసం క్యూలో నిల్చుని.. తమకు అవి దొరుకుతాయో లేదో అన్నఆందోళనతో గుండె ఆగి.. పలువురు ప్రాణాలు కోల్పోయిన ఘటనలు కూడా చోటు చేసుకున్నాయి.



## అమేథి నుంచి కూడా పోటీ చేయనున్న రాహుల్ గాంధీ..!

*న్యూఢిల్లీ,మే,2: ఉత్తరప్రదేశ్‌లోని అమేథి లోక్‌సభ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ తరఫున ఎవరు పోటీ చేస్తారనే దానిపై సస్పెన్స్ వీడింది. ఈ మేరకు వయానాడ్‌తో సహా అమేథి నుంచి కూడా రాహుల్ గాంధీ పోటీ చేయబోతున్నారు. తుది వరకు ఆ స్థానం నుంచి ప్రియాంక గాంధీ భర్త రాబర్ట్ వాద్రా పోటీ చేస్తారని భావించినా.. ఏఐసీసీ ఎట్టకేలకు రాహుల్‌నే పోటీలో నిలిపింది. దీంతో ప్రియాంక దేశ వ్యాప్తంగా కాంగ్రెస్ తరఫున ఎన్నికల ప్రచారంలో పాల్గొనబోతున్నట్లుగా తెలుస్తోంది.*

## నేను సర్దార్ పటేల్ భూమి నుంచి వచ్చిన

- రాహుల్ గాంధీని ప్రధానిని చేయాలని పాకిస్థాన్ తహతహలాడుతోంది
- కాంగ్రెస్ యువరాజులు రాజ్యాంగాన్ని నుదిటిపై పెట్టుకుని నృత్యం చేస్తున్నారు
- ఎన్నికల ర్యాలీలో ప్రధాని మోడీ



**న్యూఢిల్లీ,మే,2:** లోక్‌సభ మూడో దశ ఎన్నికలకు ముందు గుజరాత్‌లోని ఆనంద్ నగర్ లో జరిగిన ఎన్నికల ర్యాలీలో ప్రధాని మోడీ పాల్గొన్నారు. గత 60 ఏళ్లుగా బ్యాంకులను కాంగ్రెస్ కబ్జా చేసిందని అన్నారు. కాంగ్రెస్ యువరాజులు రాజ్యాంగాన్ని నుదిటిపై పెట్టుకుని నృత్యం చేస్తున్నారు.. మోడీ రాకముందు ఈ దేశంలో రెండు రాజ్యాంగాలు, రెండు జెండాలు, ఇద్దరుప్రధానులు ఉండేవారన్నారు. కాశ్మీర్‌లో భారత రాజ్యాంగాన్ని అమలు చేయడానికి కాంగ్రెస్ అనుమతించలేదు.. ఆర్టికల్ 370 గోడలా కూర్చుంది. సర్దార్ పటేల్ భూమి నుంచి వచ్చిన నేను.. ఆర్టికల్ 370ని రద్దు చేశానని చెప్పుకొచ్చారు. ఇక, కాశ్మీర్‌లో త్రివర్ణ పతాకాన్ని ఎగుర వేసి, భారత రాజ్యాంగాన్ని అమలు చేశాను అని ప్రధాని మోడీ చెప్పుకొచ్చారు. కాగా, ఒకప్పుడు ఉగ్రవాదులను ఎగుమతి చేసిన దేశం (పాకిస్థాన్) ఇప్పుడు పిండిని దిగుమతి చేసుకోవడానికి ఇంటింటికీ తిరుగుతోందన్నారు. అలాగే, కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీని టార్గెట్ చేసిన ప్రధాని.. నేడు భారతదేశంలో కాంగ్రెస్ బలహీనపడు తోందన్నారు. తమాషా ఏమిటంటే ఇక్కడ కాంగ్రెస్ చచ్చిపోతోందని.. అక్కడ పాకిస్థాన్ ఏడుస్తోంది..
ఇప్పుడు పాక్ నేతలు కాంగ్రెస్ కోసం ప్రార్థించాలి అని ఆయన చెప్పుకొచ్చారు. యువరాజు (రాహుల్ గాంధీ)ను ప్రధానమంత్రిని చేసేందుకు పాక్ ఉవ్విళ్లూరుతోంది.. పాకిస్థాన్‌కు కాంగ్రెస్‌కు మధ్య ఉన్న ఈ భాగస్వా మ్యం ఇప్పుడు పూర్తిగా బట్టబయలైంది అని ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ వెల్లడించారు.

## సింగరేణి కార్మికుల సొంత ఇంటి కల నిజం చేస్తాం..

### కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే కార్మికుల ఇన్కమ్ టాక్స్ స్లాబ్ సవరిస్తాం: మంత్రి శ్రీధర్ బాబు




హైదరాబాద్,మే,2:
సింగరేణి కార్మికుల సొంత ఇంటి కల నిజం చేస్తామని ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు హామీ ఇచ్చారు. పెద్ధపల్లి జిల్లా రామగిరి మండలం ఆర్జీ3 ఏరియా పరిధిలోని ఒసిపి 2 బొగ్గు ఉపరితలగని గేట్ మీటింగ్‌లో శ్రీధర్ బాబు మాట్లాడు తూ.. సింగరేణి కార్మికుల సొంత ఇం టి కల నిజం చేస్తామని, కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే కార్మికుల ఇన్కమ్ టాక్స్ స్లాబ్ సవరిస్తామని హామీ ఇచ్చారు.సింగరేణి పారిశ్రామిక ప్రాంతంలో పరిశ్రమలు ఏర్పాటు చేసి నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. గడ్డం వంశీకృష్ణ కు ఓటు వేసి గెలిపించాలని కోరారు. యువకుడు పారిశ్రామికవేత్త అయిన వంశీకృష్ణ మన ప్రాంతంలో పరిశ్రమలు ఏర్పా టు చేసి నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు క ల్పిస్తాడని వంశీకృష్ణకు మద్దతు తెలిపాలని మంత్రి శ్రీధర్ బాబు కార్మికులను కోరారు. అనంతరం పెద్దపల్లి జిల్లా రామగిరి మండలం రత్నాపూర్ గ్రామంలో రామగిరిఖిల్లా సమీపంలో ఉపాధిహామీ కూలీలతో ముఖాముఖి కార్యక్రమంలో ఎంపి అభ్యర్థి వంశీకృష్ణతో కలసి శ్రీధర్ బాబు పాల్గొన్నారు. రామగిరి ఖిల్లాను పెద్ద పర్యాటక కేంద్రంగా చేస్తామని, ఎన్నికల కోడ్ రాకముందే ప్రతిపాదనలు పంపామని శ్రీధర్ బాబు పేర్కొన్నారు. ఉపాధి హామీ కూలీలతో మాట్లాడుతూ.. కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక ఉపాధి హామీ పనిదినాల పెంపుతో పాటు వేతనాల పెంపుదల చేస్తామని హామీ ఇచ్చారు. ఉపాధి కూలీలతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. ఇంటి స్థలం ఉండి ఇల్లు లేని వారికి మొదటి దఫాలో ఇల్లు మంజూరు చేస్తామని తెలిపారు. ఏమైనా సమస్యల ఉంటే తన దృష్టికి తీసుకురావాలని అన్నారు.

## రైతు రుణ మాఫీ చేస్తాం..

### వచ్చే వానాకాలం పంటకు 500 బోనస్ ఇస్తాం: మంత్రి పొన్నం



**హైదరాబాద్,మే,2:** ఆగస్టు 15 లోపు 2లక్షల రైతు రుణ మాఫీ చేస్తాం వచ్చే వానాకాలం పంటకు 500 బోనస్ ఇస్తామని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. కరీంనగర్ జిల్లా జమ్మికుంట మండలంలోని నాగంపేట గ్రామ చౌరస్తాలో కార్నర్ మీటింగ్ లో పార్లమెంట్ అభ్యర్థి వెలిశాల రాజేందర్ రావుకు మద్దతుగా ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతూ..మే13న పార్లమెంట్ ఎన్నికలు జరుగబోతున్నాయ్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీలు ఇస్తామన్నాము
ఇచ్చిన మాటప్రకారం 5 నెరవేర్చామన్నారు. బీజేపీ నాయకులు ప్రజల ఖాతాలో లక్ష రూపాయలు వేస్తామన్నారు రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామన్నారు. బీజేపీ పార్టీ అభివృద్ధి చేయకుండా అక్షింతల పేరుతో రాజకీయం చేస్తుందన్నారు. కరీంనగర్ పార్లమెంటులో నేను చేసిన అభివృద్ధి తప్ప వినోద్ బండి చేసిందేమీ లేదన్నారు. బండి సంజయ్ నాయన టీచర్ అంటున్నాడు ఇరిగేషన్ డిపార్ట్మెంట్‌లో పనిచేశాడని చెబుతున్నాడని వ్యంగాస్త్రం వేశారు.
కరీంనగర్ పార్లమెంటులో నలుగురు ఎమ్మెల్యేలు వెలిశాల రాజేందర్ రావు తో కలిసి అభివృద్ధి చేస్తామన్నారు. ఆగస్టు 15 లోపు 2లక్షల రైతు రుణ మాఫీ చేస్తాం వచ్చే వానాకాలం పంటకు 500 బోనస్ ఇస్తామన్నారు.



## మత స్వేచ్ఛపై అమెరికా నివేదిక..

### ఎన్నికల్లో జోక్యం విజయవంతం కాదని భారత్ ఫైర్

న్యూఢిల్లీ,మే,2: మత స్వేచ్ఛపై అమెరికా ప్రభుత్వ కమిషన్-కమీషన్ ఆన్ ఇంటర్నేషనల్ రిలిజియస్ ఫ్రీడం విడుదల చేసిన నివేదికలోని అంశాలని భారత్ గురువారం తిరస్కరించింది. ఈ నివేదికపై ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇది "రాజకీయ ఎజెండాతో కూడి పక్షపాత సంస్థ" అని పేర్కొంది. భారతదేశం యొక్క వైవిధ్యమైన, ప్రజాస్వామ్య తత్వాన్ని అర్థం చేసుకుంటుందని అమెరికా ప్రభుత్వ కమిషన్ నుంచి తమకు ఎలాంటి అంచనాలు లేవని భారత్ పేర్కొంది. తన 2024 వార్షిక నివేదికను విడుదల చేసింది.

# జాతీయ, రాష్ట్రస్థాయి పార్టీలకు ఎన్నికల సంఘం కీలక ఆదేశాలు




న్యూఢిల్లీ: ఎన్నికల అనంతర సంక్షేమ పథకాల లబ్ధి చేకూర్చుతామంటూ ఆశచూపి, ఓటర్ల పేర్లను ప్రైవేటుగా నమోదు చేసుకోవడాన్ని తక్షణమే నిలిపివేయాలంటూ రాజకీయ పార్టీలను కేంద్ర ఎన్నికల సంఘం(ఈసీ) ఆదేశించింది. ప్రకటనలు, సర్వేలు లేదా యాప్ ద్వారా ఇలాంటి నమోదుకు సంబంధించిన కార్యకలాపాలను ఆపివేయాలని దేశంలోని అన్ని జాతీయ, రాష్ట్ర స్థాయి పార్టీలను ఈసీ కోరింది. 2024 సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల సంఘం ఈ ఆదేశాలు జారీ చేసింది. ఎన్నికల అనంతర ప్రయోజనాల వాగ్దానాన్ని ప్రోత్సహిస్తే ఓటర్లు, వాగ్దానం చేసినవారి మధ్య ఇచ్చిపుచ్చుకునే అవగాహన ఏర్పడుతుందని, ఇది ఎన్నికల ప్రక్రియ సమగ్రతను దెబ్బతీస్తుందని ఎన్నికల సంఘం వ్యాఖ్యానించింది.

ఈ విధానం ఓటర్లు, వాగ్దానం చేసే వ్యక్తుల మధ్య రాజీకి దారితీయవచ్చునని పేర్కొంది. సాధారణ ఎన్నికల వాగ్దానాలకు అనుమతి ఉన్నప్పటికీ.. పథకాల ఆశచూపి ఇప్పుడే ఓటర్ల పేర్లు నమోదు చేసుకుంటే నిజమైన సర్వేలు, రాజకీయ లబ్ధి చేకూర్చే పక్షపాత ప్రయత్నాల మధ్య వ్యత్యాసం అస్పష్టంగా మారుతుందని ఎన్నికల సంఘం ఆందోళన వ్యక్తం చేసింది.

# 400 సీట్ల రేసులో ముందంజలో మోడీ



న్యూఢిల్లీ: లోక్‌సభ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ ఘోర పరాజయం చెందుతుందని కేంద్ర హెూం మంత్రి అమిత్ షా జోస్యం చెప్పారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడిన అమిత్ షా భారత్ జోడో యాత్రతో తన పార్టీ ప్రచారాన్ని ప్రారంభించిన రాహుల్ గాంధీ కాంగ్రెస్ ఢూండో(వెదుకులాట) యాత్రతో దాన్ని ముగిస్తారంటూ ఎద్దేవా చేశారు. గురువారం నాడిక్కడ ఆయన ఎన్నికల ప్రచార సభలో ప్రసంగిస్తూ తమ ఓటు బ్యాంకు పోతుందన్న భయంతోనే రాహుల్ గాంధీ, కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ వాద్రా, సమాజ్‌వాది పార్టీ అధినేత అఖిలేష్ యాదవ్ అయోధ్యలో జరిగిన రామాలయ ప్రాణ ప్రతిష్ట కార్యక్రమానికి హాజరుకాలేదని ఆరోపించారు. అహంకారపూరిత కూటమికి చెందిన యువరాజు(రాహుల్) తన ఎన్నికల ప్రచారాన్ని భారత్ జోడో యాత్రతో మొదలు పెట్టారని, జూన్ 4న(ఓట్ల లెక్కింపు రోజు) అది కాంగ్రెస్ వెదుకులాట యాత్రతో ముగుస్తుందని అమిత్ షా వ్యాఖ్యానించారు. లోక్‌సభ ఎన్నికల మొదటి రెండు దశలలో కాంగ్రెస్ ఆచూకీ లేదని, సెంచరీని(100) సాధించిన ప్రధాని నరేంద్ర మోడీ 400 రేసులో(సీట్లు) ఆధిక్యంలో ఉన్నారని ఆయన జోస్యం చెప్పారు. ఇది ఉగ్రవాదం, నక్సలిజం అంతానికి, భారత్‌ను తృతీయ ఆర్థిక శక్తిగా మార్చేందుకు జరుగుతున్న ఎన్నికలని ఆయన తెలిపారు. ఇండియా కూటమిలో భాగస్వామ్య పక్షమైన సమాజ్‌వాది పార్టీపై ఆయన విమర్శలు గుప్పించారు. వారసత్వ రాజకీయాలను ఆ పార్టీ పెంచిపోషిస్తున్నదంటూ ఆయన ఆరోపించారు. ఆ పార్టీ అధ్యక్షుడు అఖిలేష్ యాదవ్ తన కుటుంబ సభ్యులు నలుగురికి ఈ ఎన్నికల్లో టికెట్లు ఇచ్చారని ఆయన తెలిపారు. కన్నౌజ్ నుంచి అఖిలేష్ పోటీ చేస్తుండగా ఆయన భార్య డింపుల్ యాదవ్ మెయిన్‌పురి నుంచి పోటీ చేస్తున్నారని, ఆయన కుటుంబ సభ్యులు అక్షయ్ యాదవ్, ఆదిత్య యాదవ్, ధర్మేంద్ర యాదవ్ ఫిరోజాబాద్, బుదౌన్, ఆజంగఢ్ నుంచి పోటీ చేస్తున్నారని అమిత్ షా తెలిపారు. యాదవ సామాజిక వర్గానికి చెందిన వేరే యువకులకు టికెట్లు ఇచ్చి బాగుండేదని ఆయన అభిప్రాయపడ్డారు. గత 70 ఏళ్లు రామాలయ నిర్మాణాన్ని కాంగ్రెస్ అడ్డుకుంటుండగా బిజెపి ఆ లక్ష్యాన్ని సాధించిందని ఆయన చెప్పారు. ప్రధాని మోడీని రెండవసారి ఎన్నుకున్న తర్వాత ఐదేళ్లలోనే అయోధ్య కేసు గెలవడం, ఆలయానికి భూమి పూజ, ఆలయ ప్రాణ ప్రతిష్ట పూర్తయిపోయాయని అమిత్ షా వివరించారు. ఆలయ ప్రాణప్రతిష్ట మహెూత్సవానికి రావలసిందిగా ఆలయ ట్రస్టు అకిలేష్ యాదవ్, డింపుల్, రాహుల్, ప్రియాంకలను ఆహ్వానించినప్పటికీ ఓట్లు బ్యాంకు భయంతో వారు రాలేదని ఆయన ఆరోపించారు. వారి ఓటు బ్యాంకు ఎవరో మీ అందరికీ తెలుసని ఆయన చెప్పారు. జమ్మూ కశ్మీరులో 370వ అధికరణను రద్దు చేయడాన్ని ప్రస్తావిస్తూ ఉత్తర్ ప్రదేశ్, రాజస్థాన్ ప్రజలకు కశ్మీరుతో పనేమిటని కాంగ్రెస్ అధ్యక్షుడు ప్రశ్నిస్తున్నారని, బరేలికి చెందిన చిన్న పిల్లవాడు సైతం దేశం కోసం ప్రాణత్యాగం చేయడానికి సిద్ధపడతాడని ఆయన అన్నారు. కశ్మీరులో మన త్రివర్ణపతాకం ఎగురుతోందని ఆయన తెలిపారు. పుల్వామా దాడి అనంతరం జరిగిన సర్జికల్ స్ట్రైక్‌ను ప్రస్తావిస్తూ గత కాంగ్రెస్ ప్రభుత్వాల పాలనలో అటువంటి చర్యలకు ప్రతీకార చర్యలు ఉండేవి కావని, ఎవరైనా దేశంలోకి చొరబడి బంబు పేలుళ్లు సృష్టించవచ్చని అమిత్ షా ఆరోపించారు. ఉగ్రవాదులను ఏరివేయడానికి పాకిస్తాన్ లోపలే సర్జికల్ స్ట్రైక్ చేశామని ఆయన అన్నారు. 130 కోట్ల మంది ప్రజలకు కొవిడ్ వ్యాక్సినేషన్ నిర్వహించిన ఘనత నరేంద్ర మోడీ ప్రభుత్వానికి దక్కుతుందని ఆయన చెప్పారు. 2017 వరకు ఉత్తర్ ప్రదేశ్ మత ఘర్షణలతో అట్టుడికిపోయేదని, యోగి ఆదిత్యనాథ్ అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రాన్ని ఘర్షణల రహితంగా మార్చి పశ్చిమ యుపి నుంచి ప్రజల వలసలను ఆపారని ఆయన చెప్పారు. యోగి పాలనలో గూండాలు, రౌడీ మూకల వలసలు జరుగుతున్నాయని ఆయన చెప్పారు. సమాజ్‌వాది పార్టీ పాలనలో ఉత్తర్ ప్రదేశ్‌లోని ఫ్యాక్టరీలు నాటు తుపాకులు తయారు చేసేవని, కాని ఇప్పుడు పాకిస్తాన్‌పై ప్రయోగించడానికి యుద్ధ ట్యాంకులు, క్షిపణులు తయారు చేస్తున్నాయని అమిత్ షా తెలిపారు. ప్రతిపక్ష ఇండియా కూటమి అంతర్గత కుమ్ములాటలతో సతమతమవుతోందని, ముఖ్యమంత్రి పదవిని అఖిలేష్ యాదవ్ ఆశిస్తుంటే ప్రధానిగా రాహుల్‌ను చూడాలని సోనియా కోరుకుంటున్నారని, తమ కుటుంబ సభ్యులను ప్రధానిగా, ముఖ్యమంత్రిగా చేయడం కోసం వారంతా బిజీగా ఉంటే పేద ప్రజల సంక్షేమాన్ని పట్టించుకునే తీరిక వారికి ఉంటుందా అని ఆయన ప్రశ్నించారు. మే 7న బరేలిలో లోక్‌సభ ఎన్నికలు జరగనున్నాయి.

## 400 మంది మహిళలపై ప్రజ్వల్ అఘాయిత్యం

# రాహుల్ సంచలన ఆరోపణ

శివమొగ్గ : మాజీ ప్రధాని దేవెగౌడ మనవడు, హసన ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణ పై రాహుల్ గాంధీ సంచలన ఆరోపణలు చేశారు. దాదాపు 400 మంది మహిళలపై ప్రజ్వల్ అఘాయిత్యానికి పాల్పడ్డాడని , వారి వీడియోలు చిత్రీకరించాడని అన్నారు . అటువంటి వ్యక్తికి ఓట్లు వేయాలని కోరిన ప్రధాన మంత్రి నరేంద్రమోడీ దేశ మహిళలకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. శివమొగ్గలో జరిగిన ఎన్నికల ప్రచారసభలో పాల్గొన్న ఆయన ప్రజ్వల్‌ను మోస్ట్ రేపిస్ట్‌గా పేర్కొన్నారు. " ప్రజ్వల్ రేవణ్ణ 400 మంది మహిళలపై అఘాయిత్యానికి పాల్పడి , వారి వీడియోలు చిత్రీకరించాడు. ఇది సెక్స్ కుంభకోణం కాదు. ఇది అతిపెద్ద అత్యాచార సంఘటన.



ఓట్ల గురించి వాళ్లు (బీజేపీ కూటమి)అడుగుతున్నప్పుడు ప్రజ్వల్ ఏం చేశాడో ప్రతీ మహిళ తెలుసుకోవాలి. అతడి గురించి ప్రధానికి ముందే తెలుసు. అటువంటి వ్యక్తికి కర్ణాటక వేదికగా మోడీ మద్దతు పలికారు" అని రాహుల్ గాంధీ ఆరోపించారు. ప్రజ్వల్ ఒక మాస్ రేపిస్ట్ అని బీజేపీకి చెందిన ప్రతీఒక్క నేతకు తెలుసునని రాహుల్ ఆరోపించారు. అయినప్పటికీ అతడికి మద్దతు పలకడమే కాకుండా అతడి పార్టీతో పొత్తు పెట్టుకున్నారని విమర్శించారు. అటువంటి వ్యక్తికి ప్రచారం చేసినందుకు గాను దేశంలో ప్రతీ మహిళకు ప్రధాని మోడీ , అమిత్‌షా సహా బీజేపీ నేతలు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. మరోవైపు ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణ, ఎమ్ఎల్ఏ రేవణ్ణపై లైంగిక దౌర్జన్యం అభియోగాలపై కేసు నమోదైంది. దీనిపై పూర్తిస్థాయి విచారణ చేపట్టేందుకు కర్ణాటక ప్రభుత్వం ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్ ) ఏర్పాటు చేసింది. కేసు విచారణకు హాజరు కావాలని వీరిద్దరికీ సిట్ ఇప్పటికే నోటీసులు జారీ చేసింది. వారం రోజుల సమయం కావాలని ప్రజ్వల్ చేసిన విజ్ఞప్తిని తోసిపుచ్చిన దర్యాప్తు బృందం , ఆయనపై తాజాగా లుక్‌అవుట్ నోటీస్ జారీ చేసింది.

# తిరుమలలో కుమ్మేసిన వర్షం...

## భక్తులకు ఉష్ణతాపం నుంచి ఉపశమనం



తిరుమల : ఎపిలో ఎండలు మండిపోతున్నాయి. ఎక్కడి చూసినా దాదాపు 45 డిగ్రీల ఉష్ణోగ్రతతో జనాలను ఠారెత్తిస్తున్నాయి. ఇప్పటికే ఎంతో మంది వడదెబ్బకు గురై ప్రాణాలు కోల్పోయారు. మరోవైపు కలియుగ దైవం శ్రీవేంకటేశ్వరస్వామి కొలువై ఉండే తిరుమలలో భారీ వర్షం కురిసింది. భారీ ఎండలతో కొన్ని రోజులుగా అల్లాడిపోతున్న భక్తులు ఒక్కసారిగా కురిసిన వర్షంతో ఉపశమనం పొందారు. ఉదయం నుంచి కూడా తిరుమలలో వాతావరణం కొంత చల్లగానే ఉంది. మధ్యాహ్న సమయానికి వాతావరణం పూర్తిగా మారిపోయి అరగంట సేపు జోరు వాన కురిసింది. ఈ వర్షంతో తిరుమల చల్లగా మారిపోయింది. మరోవైపు, కొండపై భారీ వర్షం కురిసినప్పటికీ.. కింద తిరుపతిలో వర్షం లేకపోవడం గమనార్హం.

## ఏపీలో 46,389 పోలింగ్ కేంద్రాలు.. ఓటర్ల వివరాలివే : సీఈఓ




ఆంధ్రప్రదేశ్ లో ఎన్నికలకు రంగం సిద్ధమైంది. రాష్ట్రంలోని మొత్తం ఓటర్లకు సంబంధించిన వివరాలను ఏపీ ఎన్నికల ప్రధానాధికారి ముఖేశ్ కుమార్ మీనా గురువారం వెల్లడించారు. రాష్ట్రంలో మొత్తం 4.14 కోట్ల మంది ఓటర్లు ఉన్నట్లు పేర్కొన్నారు. ఇందులో 65,707 మంది సర్వీసు ఓటర్లు ఉన్నారని వెల్లడించారు. ఇక ఈ ఎన్నికల కోసం మొత్తం 46,389 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు ముఖేశ్ కుమార్ మీనా వివరించారు. ఒక్కో కేంద్రంలో 1500 మంది ఓట్లు వేసే అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. ఓటర్ల సంఖ్య అంతకంటే పెరిగినప్పుడు ఆక్సిలరీ పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నామని 224 ఆక్సిలరీ పోలింగ్ కేంద్రాల కోసం ఈసీకి ప్రతిపాదనలు పంపామన్నారు.

**64 శాతం పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్...**


రాష్ట్రంలో 12,438 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని సీఈవో ముఖేశ్ కుమార్ మీనా తెలిపారు. రాష్ట్రంలో 64 శాతం పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్ ఉంటుందన్నారు. 14 నియోజకవర్గాల్లో పూర్తిగా వెబ్‌కాస్టింగ్ చేయాలని పర్యవేక్షకుల నుంచి సిఫార్సులు అందాయన్నారు. ఇందులో మాచర్ల, గురజాల, వినుకొండ, పెదకూరపాడు, ఒంగోలు, ఆళ్లగడ్డ, తిరుపతి, చంద్రగిరి, పుంగనూరు, పీలేరు, విజయవాడ సెంట్రల్, పలమనేరు, రాయచోటి, తంబళ్లపల్లి శాసనసభ నియోజకవర్గాలు ఉన్నాయని ముఖేశ్ కుమార్ మీనా తెలిపారు. ఇక, ప్రస్తుతం ఎండలు తీవ్రంగా ఉన్నాయని.. పోలింగ్ కేంద్రాల వద్ద మెడికల్ కిట్ లు కూడా ఏర్పాటు చేస్తున్నామని, నీడ ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్లు సీఈవో ముఖేశ్ కుమార్ మీనా తెలిపారు.

# 200 సీట్లు దాటడం బిజెపికి సవాలే

న్యూఢిల్లీ: లోక్‌సభ ఎన్నికల కోసం అధికార బిజెపి పెట్టుకున్న లక్ష్యాన్ని కాంగ్రెస్ నాయకుడు, తిరువనంతపురం సిట్టింగ్ అభ్యర్థి శశి థరూర్ గురువారం ఎద్దేవా చేశారు. బిజెపి చెప్పుకుంటున్న 400(సీట్లు)కి పైనే ఒక జోక్. 300కిపైనే అసాధ్యం..200కి పైనే ఒక సవాలు అంటూ ఆయన వ్యాఖ్యానించారు. ఈ ఎన్నికల్లో అధికార పార్టీ ఓటమి ముందుగానే నిర్ణయమైపోయిందని ఆయన చెప్పారు. పిటిఐ వార్తాసంస్థ ప్రధాన కార్యాలయంలో ఎడిటర్లతో ఆయన మాట్లాడుతూ కేరళ, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్‌లో బిజెపికి ఒక్క సీటు కూడా దక్కదని జోస్యం చెప్పారు. దక్షిణాదిలో బిజెపి విజయావకాశాలు 2019 కన్నా తక్కువగా ఉంటాయని ఆయన అంచనా వేశారు.

ఏప్రిల్ 26న పోలింగ్ జరిగిన తిరువనంతపురంలో బిజెపి అభ్యర్థి, కేంద్ర మంత్రి రాజీవ్ చంద్రశేఖరన్, సిపిఐ పి రవీంద్రన్ నుంచి ముక్కోణపు పోటీని ఎదుర్కొంటున్న శశి థరూర్ తాను మంచి మెజారిటీతో గెలవనున్నట్లు ధీమా వ్యక్తం చేశారు. ఈ ఎన్నికల్లో గెలిస్తే ఈ నియోజవకర్గం నుంచి వరుసగా నాలుగవసారి గెలిచిన రికార్డును ఆయన సొంతం చేసుకుంటారు. తిరువనంతపురంలో రెండు నెలలపాటు విస్తృతంగా ప్రచారం నిర్వహించి ఢిల్లీకి తిరిగి వచ్చిన శశి థరూర్ ఇక తన దృష్టిని ఇతర రాష్ట్రాలలో పార్టీ అభ్యర్థుల తరఫున ప్రచారంపై సారించనున్నారు. రెండు దశల ఎన్నికలు పూర్తయిన నేపథ్యంలో కాంగ్రెస్, ఇండియా కూటమి విజయావకాశాలు ఎలా కనిపిస్తున్నాయన్న ప్రశ్నకు ఇప్పటి వరకు 190 సీట్లకు ఎన్నిక జరిగిందని, తనకు అందుతున్న సమాచారం మేరకు తమకే అనుకూలంగా ఉందని ఆయన చెప్పారు.

తమకు అనుకూలంగా ప్రభంజనం వీస్తోందని తాను అనడం లేదని, కాని కేంద్రంలోని ప్రభుత్వానికి అనుకూలంగా కూడా పరిస్థితి లేదని ఆయన అభిప్రాయపడ్డారు. 2014, 2019 ఎన్నికలకు, ఇప్పటి ఎన్నికలకు మధ్య తేడా ఏమిటంటే ఆ ఎన్నికల్లో బిజెపి ఓటర్లలో ఉన్న భావోద్వేగం ఇప్పుడు కనిపించడం లేదని చాలామంది ఎన్నికల విశ్లేషకులు భావిస్తున్నారని థరూర్ చెప్పారు. ఇప్పటి వరకు ఓటింగ్ పూర్తయిన హిందీ మాట్లాడే రాష్ట్రాలలో పరిస్థితి ఆశాజనకంగా ఉందని కాంగ్రెస్



సభ్యులు భావిస్తున్నారని ఆయన చెప్పారు. ఈ ఎన్నికల్లో ఊహించిన దాని కన్నా అధికంగానే ముందంజలో ఉన్నామని తాను చెప్పగలనని ఆయన అన్నారు. ఇంకా ఐదు దశల ఎన్నికలు జరగవలసి ఉందని ఆయన చెప్పారు. ఈ ఎన్నికలలో కాంగ్రెస్‌కు, ఇండియా కూటమికి ఎన్ని సీట్లు వస్తాయని అంచనా వేస్తున్నారన్న ప్రశ్నకు ఒక క్రికెట్ అభిమానిగా తాను స్కోరు గురించి జోస్యం చెప్పనని, విజాయలను మ్రామే జోస్యం చెబుతానని ఆయన చమత్కరించారు. ఇప్పటి వరకు జరిగిన ఎన్నికలను బట్టి చూస్తే ఎన్‌డి ప్రభుత్వం మైజారిటీని కోల్పోయే అవకాశాలే అధికంగా కనిపిస్తున్నాయని, బిజెపి మెజారిటీని కోల్పోతోందని ముందుగానే అందరూ నిర్ణయానికి వచ్చేశారని ఆయన వ్యాఖ్యానించారు. ఆరు రాష్ట్రాలలో బిజెపి అన్ని సీట్లను గెలుచుకుందని, మూడు రాష్ట్రాలలో ఒక సీటు తప్ప అన్నీ గెలుచుకుందని, రెండు రాష్ట్రాలలో రెండు సీట్లు తప్ప అన్నిటినీ గెలుచుకుందని, అయితే ఇది ఈ సారి సాధ్యం కాదని ఆయన అంచనా వేశారు. హర్యానాలో కాంగ్రెస్ ఒక్క స్థానాన్ని కూడా గెలుచుకోలేదని, అయితే ఈసారి ఐదు నుంచి ఏడు సీట్లు కాంగ్రెస్ గెలుచుకుంటుందని సర్వేలు చెబుతున్నాయని ఆయన తెలిపారు. కర్నాటకలో గత ఎన్నికల్లో ఒక సీటును మాత్రమే కాంగ్రెస్ గెలుచుకుందని, కాని ఈ సారి 10 నుంచి 17 స్థానాలు, కొందరైతే 20 సీట్లు గెలుచుకునే అవకాశం ఉందని చెబుతున్నారనని ఆయన తెలిపారు. గత ఎన్నికల్లో మంచి విజయాలు దక్కించుకున్న రాష్ట్రాలలో సైతం బిజెపి ఈ సారి చాలా సీట్లను కోల్పోయే అవకాశం ఉందని సర్వేలు అంచనా వేస్తున్నాయని ఆయన వివరించారు. ప్రస్తుత పరిస్థితులను బట్టి చూస్తే 200 సీట్లు దాటడం బిజెపికి సవాలుగా మారనున్నదని ఆయన చెప్పారు. కేరళ, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్‌లో బిజెపి ఒక్క సీటు కూడా గెలిచే అవకాశం లేదని ఆయన జోస్యం చెప్పారు. తెలంగాణలో గత ఎన్నికల్లో కొన్ని సీట్లు గెలుచుకున్న బిజెపి ఈసారి వాటిని కాపాడుకేనేందుకు పోరాడుతోందని ఆయన వ్యాఖ్యానించారు. కర్నాటకలో కూడా ఆ పార్టీకి గత ఎన్నికల నాటి పరిస్థితి పునరావృతం అయ్యే అవకాశాలు లేవని ఆయన చెప్పారు. గతీ ఎన్నికలలో కర్నాటకలో 28 సీట్లు, తెలంగాణలో 4 సీట్లను బిజెపి గెలుచుకుంది. 2014లో ఉద్యోగాలు ఇస్తామన్న వాగ్దానం చేయడంతో బిజెపికి యువజనులు ఓటు వేశారని, పదేళ్ల తర్వాత ఉద్యోగాలు దక్కని యువజనులు బిజెపి ఇప్పుడు ఎందుకు ఓటు వేస్తారని ఆయన ప్రశ్నించారు.

# వేధింపుల కేసులో నిందితులకు ఆరు రోజుల శిక్ష



హైదరాబాద్: యువతులను, మహిళలను వేధింపులకు గురిచేస్తున్న ఐదుగురు నిందితులకు ఆరు రోజుల జైలు శిక్ష, రూ.200 జరిమానా విధిస్తూ నాంపల్లి కోర్టు గురువారం తీర్పు చెప్పింది. హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో షీటీమ్స్‌కు పలువురు బాధితులు ఫిర్యాదు చేశారు. తమను వేధింపులకు గురిచేస్తున్నారని ఫిర్యాదు చేశారు. దీంతో వెంటనే రంగంలోకి దిగిన షీటీమ్స్ పోలీసులు విచారణ చేసి నిందితులను అరెస్టు చేశారు. నిందితుల్లో ప్రభుత్వ మాజీ న్యాయవాది ఎ. సంజయ్‌కుమార్ ఉన్నారు. న్యాయవాది తనను కోర్టులో గత కొంత కాలం నుంచి వేధిపులకు గురిచేస్తున్నాడని షీటీమ్స్‌కు ఫిర్యాదు చేసింది. కోర్టులో పల బయట తనను శారీరకంగా కలిసేందుకు ఒప్పుకోవాలని వేధింపులకు గురిచేస్తున్నాడు. నిందితుడిని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్న షీటీమ్స్ పోలీసులు అరెస్టు చేసి కోర్టులో హాజరు పర్చారు. చార్మినార్ పోలీస్ స్టేషన్ పరిధిలో న్యాయవాదిపై కేసు నమోదు చేసిన పోలీసులు అరెస్టు చేశారు. బాధితులు వేధింపులపై షీటీమ్స్ హెల్ప్‌లైన్ నంబర్ 9490616555కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చని లేకుంటే వాట్సాప్‌లో మెసేజ్ చేయవచ్చని కోరారు.

# సంపాదకీయం

శుక్రవారం, మే 3, 2024

## ముంచుకొస్తున్న నీటి ముప్పు

ప్రపంచం ముందున్న అత్యంత తీవ్రమైన సమస్యల్లో జల సంక్షోభం ఒకటి. ఇటు మనదేశంలోనూ నానాటికీ జల వనరుల కొరత పెరుగుతూ పోతోంది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న మంచినీటి వనరుల్లో మన దేశం వాటా 4 శాతం మాత్రమే. మనదేశంలో ప్రతి ముగ్గురిలో ఒక మనిషి స్వచ్ఛమైన నీటిని పొందలేకపోతున్నాడని, 2050 నాటికి దేశంలో నీటి కొరత మరింత పెరగటమే గాక దేశంలో సగం జిల్లాలు తీవ్రమైన నీటి కొరతను ఎదుర్కోబోతున్నాయని నిపుణులు చెబుతున్నారు. 'పంటల సాగును మార్చడం, భారతీయ వ్యవసాయ రంగంలో నీటి వినియోగ సామర్థ్యాన్ని మెరుగుపరచడం' అనే అంశంపై డీసీఎం శ్రీరాం ఫౌండేషన్ చేపట్టిన అధ్యయనంలో దేశంలోని జలవనరుల గురించిన అనేక ఆసక్తికర, ఆందోళనకరమైన అంశాలు బయటికొచ్చాయి. భారతదేశపు భూగర్భ జలాల్లో నానాటికీ పెరిగిపోతున్న ఆర్సెనిక్, ఫ్లోరైడ్ సమస్యపై కేంద్ర భూగర్భజల అథారిటీ ప్రతిస్పందనపై నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఇటీవల అసంతృప్తి వ్యక్తం చేసింది. భారతదేశంలోని 25 రాష్ట్రాల్లోని 230 జిల్లాల్లో ఆర్సెనిక్, 27 రాష్ట్రాల్లోని 469 జిల్లాల్లో ఫ్లోరైడ్ భూగర్భ జలాలు కలుషితమయ్యాయి. మనదేశంలో 60 శాతం వ్యవసాయం భూగర్భజలాల ఆధారంగానే జరుగుతోంది. నీతి అయోగ్ 2018 నివేదిక ప్రకారం దేశంలో 60 కోట్ల మంది తీవ్ర నీటి ఎద్దడిని ఎదుర్కొంటుండగా, 43 శాతం జనాభాకు నేటికీ రక్షిత సదుపాయం లేదు. ఈ సమస్య కారణంగా ఏటా 2 లక్షలమంది ప్రజలు మృత్యువాత పడుతున్నారు. మనదేశంలోని జల వనరుల్లో 70% కలుషితమైపోవటం, నేటికీ ఇంటి ఆవరణలో తాగునీటి వసతి లేక మరోచోట నుంచి నీళ్లు తెచ్చుకునేవారి జనాభా గణనీయంగా ఉందని ఆ నివేదిక వెల్లడించింది. దేశంలోని అనేక గ్రామాల్లో మంచినీటి కోసం నేటికీ ఘర్షణలు చోటు చేసుకుంటున్నాయని, నీటి కొరత మూలంగా దేశం మహిళలు ఏటా సుమారు 15 కోట్ల పని దినాలను కోల్పోతున్నారనీ, ప్రపంచ ఆరోగ్య సంస్థ ? యూనిసెఫ్ సంయుక్త నివేదిక పేర్కొంది. పారిశుద్ధ్యం, తాగునీటి పురోగతిపై ఈ రెండు సంస్థలు చేసిన అధ్యయనంలో మోతాదుకు మించిన భూగర్భజలాల వినియోగం, భూ సారాన్ని దెబ్బతీయటం, అధిక కాలుష్యానికి కారణమై.. అనేక పర్యావరణ , సామాజిక, ఆర్థిక సమస్యలకు దారితీయనుందని వెల్లడైంది. భూగర్భజల వనరులను బాధ్యతాయుతంగా వినియోగించుకోవటానికి సరైన పర్యవేక్షణ, నియంత్రణ గల వ్యవస్థలు, ప్రణాళికలు అవసరమని ఈ అధ్యయనం వెల్లడించింది. పారిశ్రామిక వ్యర్థ జలాలు, ఇతర మానవ తప్పిదాల కారణంగా హానికారక ఆర్సెనిక్, కాడ్మియం వంటి లోహాలు భూగర్భ జలాల్లో కలిసిపోయి, మానవ, ఇతర ప్రాణుల ఉనికినే ప్రమాదంలోకి నెడుతున్నాయని దీనివల్ల రాబోయే రోజుల్లో భారత్‌లో అనేక ప్రతికూల పరిణామాలు ఏర్పడతాయని ఈ అధ్యయనం ఆందోళన వ్యక్తం చేసింది. ఇప్పటికే మనదేశంలోని గంగా పరీవాహక ప్రాంతంతో బాటు వాయవ్య రాష్ట్రాల్లో భూగర్భ జలాలు కనీస స్థాయికి పడిపోయాయి. దీనివల్ల ఇప్పటికే ఆయా ప్రాంతాల్లో పర్యావరణ ప్రతికూల పరిస్థితులు ఎదురవుతున్నాయి. ముఖ్యంగా కొన్ని రకాల జంతుజాలపు ఉనికి శాశ్వతంగా కనుమరుగు అవుతోంది. ప్రపంచవ్యాప్తంగా భూగర్భ జలాలు ఏటికేడు క్షీణించటంతో ఆహార భద్రత పెను ప్రమాదంలో పడబోతోంది. నదులు, జలాశయాల్లోకి చేరుతున్న నీటి కంటే, ప్రజలు వాడుతున్న నీరు ఎక్కువ కావటం, అదీ సరిపోక భూగర్భ జలాలను తోడేయటంతో విశ్వవ్యాప్తంగా 21 ప్రధాన జలాశయాల్లో నీటిమట్టాలు పూర్తిగా క్షీణించాయి. సౌదీ అరేబియా మొదలు పలు దేశాలు ఇప్పటికే భయంకరమైన జలసంక్షోభంలో కూరుకొని పోయాయి. 90వ దశకంలో సాగుకోసం సౌదీ అరేబియా పెద్దయెత్తున భూగర్భజలాలను తోడి, ప్రపంచంలో ఆరవ అతిపెద్ద గోధుమ ఎగుమతిదారుగా మారింది. ఇప్పుడు భూగర్భ జలాలు పడిపోవటంతో ఆ దేశం గోధుమలను విదేశాల నుంచి దిగుమతి చేసుకోవాల్సి వచ్చింది. భూగర్భ జలాల వినియోగంలో మనదేశం చైనా, అమెరికా కంటే ముందుంది. పంజాబ్, రాజస్థాన్, హర్యానా రాష్ట్రాల్లో నేటికీ బోరుబావుల ఆధారంగా వరి, గోధుమ సాగుచేస్తున్నారు. పంజాబ్‌లో ఏకంగా 78 శాతం రైతులు బావినీటిని వాడుతున్నారు. దేశంలో అత్యధికంగా గోధుమను పండించే రాష్ట్రాల్లో ఈ మూడు రాష్ట్రాలు ముందువరుసలో ఉన్నాయి. ఏటికేడు తగ్గిపోతున్న భూగర్భ జలాలు, మానవ తప్పిదాల కారణంగా భూగర్భ జలాల్లోకి చేరుతున్న ఫ్లోరైడ్, ఆర్సెనిక్ వంటి హానికారకాలు, తీర ప్రాంతాల్లో భూగర్భ జల మట్టాలు తగ్గడం వల్ల, సముద్రపు ఉప్పు నీరు చొచ్చుకొని వచ్చి పంటనేలలు ఉప్పునేలలుగా మారిపోవటం, మంచినీటి కటకట ఏర్పడుతోంది. భారత్‌లో భూగర్భ జల మట్టాలు ఏటా సగటున ఒకటి నుంచి రెండు మీటర్ల చొప్పున క్షీణిస్తున్నట్లు అంచనా. అవి 8 మీటర్ల దిగువకు పడిపోయిన జిల్లాల్లో పేదరికం రేటు మిగతా జిల్లాల కంటే తొమ్మిది నుంచి 10శాతం అధికంగా ఉందని నివేదికలు వెల్లడిస్తు?న్నాయి. భూగర్భ జలాల లభ్యత క్షీణిస్తే భారత్‌లో 25 శాతానికి పైగా సాగుభూమి తక్షణం ప్రభావితమై కరువు తప్పదని నిపుణులు హెచ్చరిస్తున్నారు. చిత్తడి నేలలు, నదీ ముఖద్వారాల ఆక్రమణ, పెరుగుతున్న పట్టణీకరణ, చెరువులు, ఇతర నీటి వనరుల విధ్వంసం, అతి వినియోగం భూగర్భ జలాల క్షీణతకు ప్రధాన కారణాలు. ప్రస్తుతం చాలా చోట్ల నీరు అధికంగా అవసరమయ్యే వరి, గోధుమ, చెరకు పంటలనే రైతులు ఎక్కువగా పండిస్తున్నారు. పలు రాష్ట్రాల్లో వ్యవసాయానికి ఉచిత విద్యుత్తు పథకాన్ని ఆసరాగా చేసుకొని కొందరు రైతులు అవసరానికి మించి భూగర్భ జలాలను తోడేస్తున్నారు. దీనివల్ల భవిష్యత్తులో తీవ్ర నీటి ఎద్దడి ఎదుర్కోవాల్సి వస్తుందని గుర్తించాలి. అందుబాటులో ఉన్న నీటిని అవసరం మేరకు పొదుపుగా వాడుకోవాలి. ఖరీఫ్,రబీ సీజన్‌లో ఒకే పంట పండించే పద్ధతిని మానుకోవటం, తక్కువ నీటితోనే పండే పోషక విలువలున్న చిరుధాన్యాల సాగుకు రైతాంగాన్ని సిద్ధం చేయాలి. పలు పరిశ్రమలు ప్రమాదకర వ్యర్థాలను గుట్టుచప్పుడు కాకుండా నదులు, చెరువుల్లోకి వదిలిపెడుతున్నాయి. వాన నీటిని ఒడిసిపట్టి ఆయా అవసరాలకు వినియోగించుకోవాలి. తద్వారా భవిష్యత్తులో జల సంక్షోభం తలెత్తకుండా నివారించవచ్చు. నిబంధనల మేరకు వ్యర్థాలను శుద్ధి చేయని కర్మాగారాలపై కఠిన చర్యలు తీసుకోవాలి.

## ఉపాధి హామీ కూలీల వేతనాన్ని పెంచాలి

### - మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్





తెలంగాణ క్యాపిటల్ న్యూస్ బెజ్జంకి: ఉపాధి హామీ కూలీలకు కనీస వేతనంగా రోజుకు కనిష్ఠంగా 300 రూపాయలు కూలీని చెల్లించాలని మానకొండూరు మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ డిమాండ్ చేశారు. ఆయన గురువారం బెజ్జంకి మండలంలోని కల్లేపల్లి, బెజ్జంకి, గుగ్గిళ్ళ గ్రామాలలో ఉపాధి హామీ కూలీల చెంతకు చేరి వారితో కాసేపు పనులను చేసి, కరీంనగర్ బి.ఆర్.ఎస్ పార్లమెంటరీ పార్టీ అభ్యర్థి బోయినపల్లి వినోద్ రావును గెలిపించాలని కోరారు. మండుటెండల్లో చేతులకు బొబ్బలు వచ్చేలా ఉపాధి హామీ కూలీలు కష్టపడితే రోజుకు 200 సైతం రావడంలేదని తనకు బాదగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధి హామీ కూలీలకు కనీస వేతనం దక్కాలంటే వినోద్ రావును పార్లమెంటుకు పంపాలని, కారు గుర్తుకు ఓటేయాలని స్పష్టం చేశారు. రసమయి తాను చేసిన అభివృద్ధి పనులను తెలుపుతూ కూలీలతో ముచ్చటిస్తూ పార్టీకి ఓట్ వేయాలని కోరారు. బిజెపి నీ గెలిపిస్తే నిత్యవసర వస్తువులు పెరుగుతాయని, బండి సంజయ్ ఎన్నడూ గ్రామాల వైపు రాలేదని ఓట్ల కోసం మాత్రమే , ఇప్పుడు రాముని పేరుతో, చిత్రపటాలను పట్టుకొని చిత్రంగా ప్రవర్తిస్తున్నాడని ఎద్దేవా చేశారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ మాయమాటలు నమ్మి ఓట్లు వేస్తే ఏమైందో మీకే తెలిసిందని, ఇప్పటికైనా బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కల్లేపల్లిలో ఇటీవల ఆత్మహత్య కు పాల్పడిన కోరుకొప్పుల సత్తయ్య కుటుంబాన్ని, బెజ్జంకి లో బీఅర్ఎస్ కార్యకర్త కల్లూరి రవి తల్లి మృతి చెందగా ఆయన కుటుంబాన్ని పరామర్శించినారు. ఆయనతో పాటుగా బెజ్జంకి ఎంపీపీ లింగాల నిర్మల, టిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు మహిపాల్ రెడ్డి, లింగాల లక్ష్మణ్, గుబిరె మల్లేశం ,వంగ నరేష్, దొంతర వేణి ఒదెలు, పుర్మ జగన్, అయిలేనీ నరసింహా రెడ్డి, సంఘ నరేష్, శేఖర్ బాబు, వాసిమల్ల నరేష్ తదితరులు ఉన్నారు

## కాంగ్రెస్‌లో చేరిన పలువురు బీఆర్ఎస్ నాయకులు

### - రాజేందర్ రావ్ గెలుపు ఎవరు ఆపలేరు - ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ



తెలంగాణ క్యాపిటల్ గన్నేరువరం: బిఆర్ఎస్ పార్టీ నుండి కాంగ్రెస్ పార్టీ లోకి గన్నేరువరం మండలం లోని బిఆర్ఎస్ నాయకులు భారీగా చేరారు. గురువారం కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు కొమ్మెర రవీందర్ రెడ్డి ఆధ్వర్యంలో మాదాపూర్ గ్రామంలోని టీఆర్ఎస్ నాయకులు చేరారు. చేరిన వారిలో మాజీ సర్పంచ్ కుమ్మరి సంపత్, బోడ మాధవరెడ్డి, సంపత్ ఉదయ్ మరియు సుమారు 50 మందికి పైగా టీఆర్ఎస్ కార్యకర్తలు చేరగా వీరిని మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపెల్లి సత్యనారాయణ కండువా కప్పి ఆహ్వానించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ తోనే అభివృద్ధి సాధ్యమని,కాంగ్రెస్ ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీ పథకాల అమలు తో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారని, వెలిచాల గెలుపు కోసం కృషి చేస్తామని తెలిపారు.

కార్యక్రమంలో కరీంనగర్ ఎంపీ అభ్యర్థి వెలిచాల రాజేందర్ రావు, బిసి సెల్ మండల అధ్యక్షుడు మార్గం మల్లేశం , తదితరులు పాల్గొన్నారు.

## జోరుగా బీఆర్ఎస్ నాయకుల ప్రచారం

### - ఎంపి అభ్యర్థి వినోద్ కుమార్ కృషి తోనే మండల ఏర్పాటు

### - బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని వివరిస్తూ కరపత్రాలతో ప్రచారం

తెలంగాణ క్యాపిటల్ న్యూస్ గన్నేరువరం: బీఆర్ఎస్ తోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యమని, కరీంనగర్ ఎంపీ గా బోయినపల్లి వినోద్ కుమార్ ను గెలిపించాలంటూ బీఆర్ఎస్ గన్నేరువరం మండల అధ్యక్షుడు గంప వెంకన్న, జడ్పీటీసీ మాడుగుల రవీందర్ రెడ్డి బూత్ కన్వీనర్ల ఆద్వర్యంలో మండల కేంద్రము తో పాటు, మాదాపూర్,పారువెల్ల , చీమలకుంటపల్లి, మైలారం, తదితర గ్రామాల్లో ఇంటింటా ప్రచారం నిర్వహించారు.



ఈసందర్భంగా మాట్లాడుతూ గన్నేరు వరం మండలం ఏర్పాటు వినోద్ కుమార్ కృషే అని, గడప గడపకు కరపత్రాలు పంచి బోయినపల్లి వినోద్ కుమార్ ను గెలిపించాలని కోరారు. ఎంపిఅభ్యర్థి వినోద్ కుమార్ కృషి తోనే మండల కేంద్రము ఏర్పాటు జరిగిందన్నారు. గత పది సంవత్సరాలుగా చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు వివరిస్తూ ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను విస్మరించి ప్రజలను మోసం చేస్తుందని, ఆరు గ్యారంటీ పథకాల అమలులో ప్రభుత్వం విఫలమైందని , బీజేపీ , కాంగ్రెస్ మాటలు నమ్మొద్దని , తెలంగాణా లో మల్లీ బీఆర్ఎస్ పాలన కోరుకుంటున్నారని అన్నారు. ఓటర్లను చైతన్య పరుస్తూ కారు గుర్తుకు ఓటు వేసి బీఆర్ఎస్ అభ్యర్థి ని గెలిపించాలని కోరుతున్నారు. ఈ ప్రచారంలో న్యాత స్వప్న సుధాకర్,కుసుంబ నవీన, బామండ్ల తిరుపతి, దానబోయిన లక్ష్మయ్య, పుల్లెల లక్ష్మణ్, మీసాల ప్రభాకర్, బోయిని కుమార్, బోయిని అంజయ్య,సందవేని ప్రశాంత్, పాశం బాలయ్య, బూర శ్రీనివాస్, పాలెపు అజయ్, తదితర బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## అప్రమత్తమైన గ్రామపంచాయతీ అధికారులు - గ్రామస్తులు బయటకు రావద్దని మైకు తో ప్రచారం



తెలంగాణ క్యాపిటల్ న్యూస్, రామడుగు: గత వారం రోజుల నుండి ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటున్న విషయం అందరికీ తెలిసినదే. బుధవారం రామడుగు మండలంలోని గోపాల్ రావు పేట గ్రామంలో బుధవారం ఐదు సంవత్సరాల బాలుడు వడదెబ్బతో చనిపోగా అప్రమత్తమైన గ్రామపంచాయతీ గురువారం సిబ్బంది గ్రామస్తులు ఎవరు బయటకు రావద్దని మైకులో అనౌన్మెంట్ చేస్తూ వాడ వాడలలో తిరిగారు. ఈ సందర్భంగా ఎండ తీవ్రత ఎక్కువైనందున గ్రామస్తులు ఎవరు బయటకు రావద్దని, ఎండ తీవ్రతతో తగు జాగ్రత్తలు పాటించాలని గ్రామస్తులను కోరారు.

## చలివేంద్రంతోపాటు చల్లని మజ్జిగ కేంద్రం ప్రారంభం




తెలంగాణ క్యాపిటల్ న్యూస్ ఇల్లంతకుంట (బెజ్జంకి): రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండల కేంద్రం లో బీటీఅర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చలివేంద్రంతోపాటు చల్లని మజ్జిగ కేంద్రాన్ని బిటిఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు బెంద్రం తిరుపతిరెడ్డి గురువారం ప్రారంభించారు. గతంలోనే చలివేంద్రం ఏర్పాటు చేశామని, మండల కేంద్రమైన ఇల్లంతకుంటలో గురువారం సంత జరుగుతుందని, సంతకు వచ్చే వారితో పాటుగా , ఇతరులకు సైతం చల్లని మజ్జిగను ఇవ్వనున్నట్లు తిరుపతిరెడ్డి తెలిపారు. వేసవికాలంలో ఎండలు ఎక్కువగా ఉన్న దృష్ట్యా ప్రజలు కొంతమేరకైన ఉపశమనం పొందాలనే, తలంపుతో చల్లని మజ్జిగ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బండారి రాజు, బోయిని రంజిత్, గజ్జల శ్రీనివాస్, దండవేణి రజినీకాంత్ , సూదుల కిషన్, కర్ణ లక్ష్మణ్ , జనగామరాజు తదితరులు పాల్గొన్నారు.

## వడ్ల కొనుగోలు కేంద్రాల వద్ద బీఆర్ఎస్ ప్రచారం



తెలంగాణ క్యాపిటల్ న్యూస్ బెజ్జంకి: బెజ్జంకి మండలంలోని చిలాపూర్ గ్రామంలో గల వరి ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద గ్రామ బీఆర్ఎస్ పార్టీ నాయకులు పలువురు కారు గుర్తుకు ఓటు వేయాలని కోరుతూ ప్రచారాన్ని గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చిలాపూర్ బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షులు పంతం శ్రీనివాస్, మాజీ ఉప సర్పంచ్ బండిపల్లి సంపత్, యూత్ అధ్యక్షులు చిలక రాజు, పవ్వాడి శేఖర్, రాదారం రవి, రావుల రాజు, బండి పెల్లి శ్రీనివాస్, ఇప్పలపల్లి సందీప్, రాయమల్లు, బాలయ్య, రమేష్, సంతోష్, మల్లేశం తదితరులు ఉన్నారు.

## పోరండ్లలో బీఆర్ఎస్ వాడవాడలా ల ప్రచారం



తెలంగాణ క్యాపిటల్ న్యూస్ తిమ్మాపూర్ (బెజంకి): కరీంనగర్ పార్లమెంట్ బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి బోయినపల్లి వినోద్ కుమార్ ను గెలిపించాలని కోరుతూ తిమ్మాపూర్ మండలంలోని పోరండ్ల గ్రామంలో బి.ఆర్.ఎస్ పార్టీ నేతలు విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. కారు గుర్తుకు ఓటు వేసి , కరీంనగర్ అభివృద్ధి లో భాగస్వాములు కావాలని, అది బీఆర్ఎస్ వల్లే అవుతుందని తెలుపుతూ, గ్రామంలోని వాడవాడల ప్రచారాన్ని నిర్వహించారు. అనంతరం ఉపాధి హామీ పనులను చేస్తున్న కూలీల చెంతకు వెళ్లి కరపత్రాలను పంచుతూ ఓటు వేయాలని కోరినారు. ఉపాధి కూలీలకు మజ్జిగ పాకెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నేతలు కేతిరెడ్డి దేవేందర్ రెడ్డి, రావుల రమేష్ , రెడ్డి తిరుపతిరెడ్డి, కిన్నెర సతీష్, శ్రీనివాస్ , సుంకరి కిరణ్, అసోద రాములు, భూమయ్య, వీరయ్య, వెంకటేష్ పలురు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## అంతరాయం లేకుండా నిరంతర విద్యుత్ కొనసాగాలి

**- లోటుపాట్లను గుర్తించి సవరించాలి**

**- ఎస్ ఈ గంగాధర్**





**తెలంగాణ క్యాపిటల్ న్యూస్, రామడుగు:** అంతరాయం లేకుండా 24 గంటల విద్యుత్ వినియోగదారులకు వచ్చేలా చర్యలు తీసుకోవాలని గంగాధర ఎస్ ఈ వడ్లకొండ గంగాధర్ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా గురువారం రామడుగు మండలంలోని గుండి సబ్ స్టేషన్ ను పరిశీలించారు. అనంతరం సంబంధిత అధికారులతో మాట్లాడుతూ గ్రామాలలో విద్యుత్ సరఫరా లోటుపాట్లను గుర్తించి వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్తును అందే విధంగా చర్యలు తీసుకోవాలని, అలాగే వినియోగదారుల నుండి వచ్చిన ఫిర్యాదులను సత్వరమే గుర్తించి సమస్య పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డి ఈ తిరుపతి, ఏఈ శంకరయ్య, సబ్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

# విధ్వంసం కావాలా... అభివృద్ధి కావలా...

**- రూపాయి అభివృద్ధి చేయని సంజయ్‌ని నిలదీయండి**

**- దేవుడి పేరుతో ఓట్లు అడగడం సిగ్గుచేటు**



**తెలంగాణ క్యాపిటల్ న్యూస్ కరీంనగర్ ప్రతినిధి:** బిజెపిని గెలిపించి విధ్వంసం కోరుకుంటారో బిఆర్ఎస్ ని గెలిపించి అభివృద్ధిని కోరుకుంటారో ప్రజల నిర్ణయించుకోవాలని కరీంనగర్ బిఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వినోద్ కుమార్ అన్నారు. మాయమాటలు మోసపూరిత హామీలతో కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీల పేరు చెప్పి ప్రజలను మోసం చేసిందని ఆరోపించారు. ఇప్పుడు బీజేపీ దేవుడి పేరు చెప్పి గారడీ మాటలతో ప్రజలను మోసం చేయాలని చూస్తున్నారని వ్యాఖ్యానించారు. పదేళ్ళలో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో తెలంగాణ అభివృద్ధి సాధించిందని పేర్కొన్నారు. ఇప్పుడు కాంగ్రెస్, బీజేపీలకు ఓట్లు వేసి ప్రజలు మోసపోవద్దని వినోద్ కుమార్ అన్నారు. తిమ్మాపూర్ మండలం పోరండ్ల, మన్నెంపల్లి, తిమ్మాపూర్ గ్రామాల్లో మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ తో బీఆర్ఎస్ నాయకులను కలిసి పార్లమెంట్ ఎన్నికలలో గెలుపే లక్ష్యంగా పని చేయాలని సూచించారు. ఈ సందర్భంగా బోయినపల్లి వినోద్ కుమార్ మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ కు ఓటేస్తే కొట్లాడి నిధులు తెచ్చి అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు. కాంగ్రెస్, బీజేపీలకు ఓట్లేస్తే విధ్వంసం చేస్తారని అన్నారు. పదేళ్ళ పాలనలో బీజేపీ చేసిన అభివృద్ధి చెప్పుకోలేకనే దేవుడి పేరుతో రాజకీయాలు చేస్తున్నారని అన్నారు. కరీంనగర్ ఎంపీగా గెలిచిన బండి సంజయ్ ఐదేళ్లలో బుడ్డ పైసా అభివృద్ధి చేయలేదని విమర్శించారు. మతరాజకీయాలు చేస్తూ బండి సంజయ్ రాజకీయ పబ్బం గడుపుతున్నారని ఆరోపించారు. కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ప్రజలు ఆలోచన చేయాలన్నారు. ఆరు గ్యారెంటీల పేరుతో కాంగ్రెస్ అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలను మోసం చేసిందని 2లక్షల రైతురుణమాఫీ, కళ్యాణలక్ష్మీ లక్షతో పాటు తులం బంగారం, మహిళలకు2500, ఉచిత సిలిండర్, రైతు భరోసా 15000, రైతు కూలీలకు 12000, పెన్షన్ 4000, వంటి హామీలతో మోసం చేశారన్నారు. యాసంగి పంటకు 500ల భోనస్ ఇస్తామని చెప్పి ఇప్పుడు ప్రభుత్వం నోరుమెదపడం లేదని పేర్కొన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ కు ప్రజలు కర్రుకాల్చి వాతపెట్టడం ఖాయమని అన్నారు. కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ప్రజలు ఆశీర్వదించి కారు గుర్తుపై ఓటు వేసి నన్ను ఎంపీగా గెలిపించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ పొన్నం అనిల్ కుమార్ గౌడ్ , బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రావుల రమేష్,

**- గ్యారంటీలు బూటకం ప్రజలను మోసం చేసి అధికారం లోకి వచ్చిన కాంగ్రెస్**

**- కరీంనగర్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వినోద్ కుమార్ ధ్వజం**



బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కేతిరెడ్డి దేవేందర్ రెడ్డి, ఉల్లెంగుల ఏకానందం, స్వామిరెడ్డి, తిరుపతి రెడ్డి, ఎలుక ఆంజనేయులు, జాప శ్రీనివాస్ రెడ్డి, పుప్పాల కనకయ్య, తదితరులు పాల్గొన్నారు.

## వేగంగా ఫోన్ ట్యాపింగ్ దర్యాప్తు

**హైదరాబాద్:** రాష్ట్రంలో పెను సంచలనం రేపిన ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో ఇప్పటిదాకా కేవలం పోలీస్ బాసులు, ఉన్నతాధికారులపైనే ఫోకస్ చేసిన స్పెషల్ టీమ్ త్వరలోనే మరో బాంబు పేల్చబోతోంది. పార్లమెంట్ ఎన్నికలు అవగానే స్పెషల్ టీమ్ రాజకీయ నేతలపై ఫోకస్ పెట్టనుంది. ఇప్పటికే పలువురు అధికారులు నాడు రాజకీయ నాయకులు చెబితేనే ఫోన్ ట్యాపింగ్ చేశామని చెబుతున్నారు. ఈ వ్యవహారాన్ని కేసీఆర్, కేటీఆర్ చాలా తేలిగ్గా తీసుకున్నట్లు కనిపిస్తోంది. ట్యాపింగ్ చేయడం అనేది పోలీసు వ్యవస్థలో భాగమేనని, అందులో ఏ మాత్రం రాజకీయ జోక్యం ఉండదని చెబుతున్నారు. అయితే, మునుగోడు, దుబ్బాక ఉప ఎన్నికల సమయంలో ఏకంగా టాస్క్ ఫోర్స్ వాహనాలలో డబ్బులు తరలించామని అరెస్టయిన అధికారి వాంగ్మూలం చుట్టూ ఇకపై పోలీసులు ఫోకస్ పెట్టనున్నట్టు తెలుస్తోంది. ఇప్పటిదాకా ఆచితూచి సాగిన ఫోన్ ట్యాపింగ్ కేసు దర్యాప్తు, ఎన్నికల హడావుడి ముగిసిన తర్వాత ఊపందుకునే అవకాశం ఉంది. మొదటి దశ దర్యాప్తు పూర్తయ్యేసరికి రాష్ట్రంలో లోక్ సభ ఎన్నికల సందడి మొదలైంది. పోలీసులు ఎన్నికల విధుల్లో తలమునకలయ్యారు. అయితే, ఎన్నికలయ్యాక జరిగే దర్యాప్తు అంతా రాజకీయ నాయకుల చుట్టూనే తిరిగే అవకాశం ఉంది. అందుకే, ప్రస్తుతానికి ఈ దర్యాప్తునకు కొంత విరామం ఇచ్చి, ఎన్నికలు పూర్తయిన తర్వాత తిరిగి మొదలుపెట్టాలనేది అధికారుల ఆలోచనగా తెలిసింది. పలువురు రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధుల ఫోన్లు ట్యాప్ చేశారన్నది ప్రధాన అభియోగం కాగా ఎవరి కోసం చేశారన్నది తేల్చకపోతే కేసు నిలబడే అవకాశం లేదు. అందుకే, ఇప్పటి వరకూ క్షేత్రస్థాయిలో ఆధారాల సేకరణపై దృష్టి పెట్టిన దర్యాప్తు అధికారులు ఇక మీదట పైస్థాయిలో జరిగిన తతంగాన్ని నిగ్గు తేల్చనున్నారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంతో సంబంధమున్న రాజకీయ నేతలకు త్వరలోనే నోటీసులు జారీ చేసేలా ఇన్వెస్టిగేషన్ టీమ్ రెడీ అవుతోంది. ఆ లీడర్లు ఎవరనేది అటు రాజకీయ వర్గాలతో పాటు ఇటు ప్రజల్లోనూ హాట్ టాపిక్‌గా మారింది. ఈ నేతలను కొద్దిమంది పోలీసులు 'లక్కీ సిక్స్' అని పిల్చుకుంటున్నారు. గతంలో 'కీ రోల్' పోషించిన ఇద్దరు మాజీ మంత్రులు, పార్టీ అగ్రనేతలకు సన్నిహితంగా ఉన్న ఓ ఎమ్మెల్సీ, టాప్–ఫైవ్‌లో ఉన్న మరో నేతతో పాటు మాజీ ఐఏఎస్‌ను కూడా పోలీసులు పేర్కొంటున్న 'లక్కీ జాబితాలో ఉన్నట్టు సమాచారం. ట్యాపింగ్ వ్యవహారం వెలుగులోకి వచ్చినప్పటి నుంచి వీరి పేర్లు బహిరంగంగా వినిపిస్తున్నా నోటీసులు అందుకున్న తర్వాతనే ఆ నేతలు ఎవరనే క్లారిటీ రానున్నది. గతంలో ఎస్ఐబీలో అధికారులుగా పనిచేసినవారిని మాత్రమే ఇప్పటి వరకు అరెస్టు చేసి కస్టడీలోకి తీసుకుని పోలీసులు విచారించారు. ఇప్పుడు వారందరి కస్టడీ పీరియడ్ ముగిసిపోవడంతో జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్నారు. తదుపరి దర్యాప్తు ఏ దిశగా సాగుతుందనే ఉత్కంఠ అందరిలో నెలకొన్నది. వారి స్టేట్‌మెంట్లలో రికార్డు చేసిన అంశాల్లో పొలిటికల్ లీడర్ల ప్రమేయం ఉందని తేలడంతో వారికి కూడా నోటీసులిచ్చి ప్రశ్నించాలన్నది పోలీసుల ఆలోచన. ఫోన్ ట్యాపింగ్‌లో వారి ప్రమేయమేంటి? ప్రతిపక్ష పార్టీల నేతల సంభాషణలపై ఎందుకు దృష్టి పెట్టాల్సి వచ్చింది? వారిని కట్టడి చేయాలని ఆర్డర్ ఇచ్చినవారెవరు? ఇలాంటివాటిని ఇప్పుడు పోలీసులు రాబట్టాలనుకుంటున్నారు.

## ఇసి గీత దాటిన...

# ఎమ్మెల్యే మక్కాన్ సింగ్..!

**- ఎల్ఐసి ఆఫీస్ లో సమావేశం..!**

**- దగ్గరుండి సహకరించిన బ్రాంచి మేనేజర్..!**

**- సమావేశానికి హాజరైన మరో ఇద్దరు అధికారులు..!**





**తెలంగాణ క్యాపిటల్ న్యూస్ రామగుండం ప్రతినిధి :** ఎన్నికల కమిషన్ ఆదేశాలను తుంగలో తొక్కుతూ రామగుండం ఎమ్మెల్యే ఠాకూర్ మక్కాన్ సింగ్ కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ అయిన ఎల్.ఐ.సి కార్యాలయంలో ఎన్నికల సమావేశం నిర్వహించారు. ఇసి నిబంధనలకు నీళ్లొదులుతూ సదరు నేత చేసిన పనికి ఆ సంస్థ బ్రాంచి మేనేజర్ నందిగామ శ్రీనివాస రావ్ తో పాటు మరో ఇద్దరు అధికారులు అసిస్టెంట్ బ్రాంచి మేనేజర్ నాగేంద్ర , అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ శ్రీనివాస్ సహకరించడమే కాదు..ఏకంగా సమావేశ వేదికను అలంకరించి మద్దతు పలికారు.. ఈ ఘటన రామగుండం అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రం లోని ఎల్ఐసి బ్రాంచి కార్యాలయంలో గురువారం చోటుచేసుకుంది.. ఈ సందర్భంగా ఇన్సూరెన్స్ సంస్థ అధికారులు వ్యవహరిస్తున్న తీరుపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మక్కాన్ సింగ్ సమావేశానికి హాజరయ్యేందుకు వచ్చే సమయానికంటే ఇరవై నిమిషాల ముందు నుంచే సదరు అధికారులు కార్యాలయ గేట్ వద్ద స్వాగతం పలికేందుకు వేచి ఉండడం కొసమెరుపు.. సమావేశం సందర్భంగా టీలు, బిస్కట్ల ఖర్చు కూడా సదరు మేనేజర్ ఎల్ఐసి ఖాతాలోనే వేసినట్లు సమాచారం..!ఈ సమావేశంలో పాల్గొన్న మక్కాన్ సింగ్ కాంగ్రెస్ అభ్యర్థి ని గెలిపిస్తే ఏజంట్ల సంఘ భవన నిర్మాణానికి నిధులు కేటాయిస్తామన్న హామీ ఇచ్చినట్లు తెలిసింది..! రాజకీయ పక్షాల సమావేశాన్ని కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ లో జరుపడం, దానికి అధికారులు సహకరించడం పై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి..

## రాత్రి వేళలో మద్యం తరలింపు



**తెలంగాణ క్యాపిటల్ న్యూస్ బెజ్జంకి:** మండల కేంద్రమైన బెజ్జంకిలో రెండు మద్యం షాపులు ఉండగా అందులో దుర్గ వైన్స్ నుండి అక్రమంగా రాత్రివేళలో మద్యాన్ని తరలిస్తున్నారు. బెల్ట్ షాపులు ఎన్నికల కోడ్ ఉందని ఎక్సైజ్ అధికారులు పోలీసు అధికారులు నడపడనేయటం లేదు. కానీ రాత్రి 11 గంటల వేళ బెజ్జంకిలోని ఆ షాపులో ఉన్న లిక్కర్ ను ఆటోలో ఎక్కడికి చేరవేస్తున్నారు తెలియడం లేదు. ఇదంతా రాబోయే పార్లమెంటు ఎన్నికల కోసం భద్ర పరచి ఎక్కువ ధరలకు పక్కదారి పట్టించి, అప్పుడు రాజకీయ నాయకులకు సరఫరా చేస్తూ లబ్ధి పొందడానికి ఈ ప్రయత్నం చేస్తున్నారని బాహాటంగా చెబుతున్నారు. ఈ తరలింపు కూడా అధికారుల కనుసన్నలలో నే జరుగుతున్నట్లు తెలుస్తోంది. పట్టించుకోవాల్సిన అధికారులు పట్టించు కోవడం లేదని , మామూళ్ల మత్తులో జోగుతూ వున్నారని పలువురు గుసగుస లాడుతుతున్నారు.

## కోహెడ మండల కాంగ్రెస్ నేతల ప్రచారం




**తెలంగాణ క్యాపిటల్ న్యూస్ కోహెడ (బెజ్జంకి):** కోహెడ మండలంలోని తంగళ్ళపల్లి గుండారెడ్డిపల్లి గ్రామాలలో గురువారం మండల కాంగ్రెస్ పార్టీ నేతలు పలువురు వాడవాడల, గడపగడపకు వెళ్లి కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ పార్లమెంట్ అభ్యర్థి వెలిచాల రాజేందర్ రావు ను గెలిపించాలని కోరుతూ పెద్ద ఎత్తున ప్రచారాన్ని నిర్వహించినారు. చేతి గుర్తుకు ఓటు వేయాలని కోరుతూ కరపత్రాలను పంచి పెడుతూ ఓటర్లను అభ్యర్థించారు. ఈ కార్యక్రమం కోహెడ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మంద ధర్మయ్య ఆధ్వర్యంలో జరగగా , బండిపెల్లి నారాయణ గౌడ్, శెట్టి సుధాకర్, భీం రెడ్డి మల్లా రెడ్డి, కర్ర రవి, భీం రెడ్డి తిరుపతి రెడ్డి, బొయిని అశోక్, మహ్మద్ అబ్దుల్ రఫీ, దూలం శ్రీనివాస్ గౌడ్, చింతకింది శంకర్, మల్యాల శ్రీనివాస్ రెడ్డి, నంగునోరి శ్రీనివాస్, పాము శ్రీకాంత్, పిల్లి రాజయ్య, నాగరాజు వెంకన్న, గాడిచర్ల సంపత్ కుమార్ , ఉప్పరపల్లి నరేశ్, యాటేల్లి రాజు, పులి రాజు ,బోయిని సంపత్, చింతల యాదగిరి, జాప రాజిరెడ్డి, గుజ్జుల సంజీవ రెడ్డి, చిగురి కొమురయ్య,పిల్లి కనుకయ్య, చెప్యాల చంద్రయ్య,చుక్క ఎల్లయ్య, అర్శనపల్లి సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

## పోస్టల్ బ్యాలెట్ వినియోగానికి ఏర్పాట్లు : కలెక్టర్ అనురాగ్ జయంతి

**- వేములవాడ పోస్టల్ బ్యాలెట్ ఫెలిసిటేషన్ కేంద్రం పరిశీలన**

**తెలంగాణ క్యాపిటల్, వేములవాడ:** లోక్ సభ ఎన్నికల నేపథ్యంలో పోస్టల్ బ్యాలెట్ కోసం అన్ని ఏర్పాట్లు చేశామని కలెక్టర్ అనురాగ్ జయంతి తెలిపారు. లోక్ సభ ఎన్నికల్లో భాగంగా పోస్టల్ బ్యాలెట్ వినియోగానికి వేములవాడలోని గురువారం నూతన లైబ్రరీ భవనం లో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ కేంద్రమును కలెక్టర్ అనురాగ్ జయంతి సాయంత్రం పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి అనురాగ్ జయంతి మాట్లాడుతూ, ఎన్నికల విధులు నిర్వహిస్తున్న సిబ్బంది తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు సిరిసిల్ల, వేములవాడ లలో పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ కేంద్రాలను నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. జిల్లాలో పోస్టల్ బ్యాలెట్ ద్వారా 744 మంది ఎన్నికల సిబ్బంది తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారని, వీరికి తేదీ మే 3 నుండి మే 8 వరకు పోస్టల్ బ్యాలెట్ ద్వారా వినియోగించుకునే అవకాశం కల్పిస్తామని కలెక్టర్ తెలిపారు. పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకునే వారు 12 రకాల ఫోటో గుర్తింపు కార్డు లలో ఏదైనా ఒకటి తమ వెంట తీసుకుని వచ్చి ఓటు హక్కు వినియోగించుకోవాలని ఎన్నికల విధులు నిర్వహించే సిబ్బంది ఎలాంటి పొరపాట్లు జరగకుండా చూడాలని, హోమ్ ఓటింగ్ లో గోప్యత ను పాటించాలని నిర్ణీత నమూనా ఫారాల లో




సమాచారాన్ని పూర్తి చేయాలని సూచించారు. క్షేత్ర పరిశీలనలో వేములవాడ ఆర్డీవో, ఏ.ఆర్.ఓ రాజేశ్వర్, సిరిసిల్ల ఆర్డీవో రమేష్, డీ.డబ్ల్యూ.ఓ లక్ష్మీరాజం, వేములవాడ అర్బన్ తహసీల్దార్ మహేష్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.